క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన చారులత



పొలిటికల్ రిపోర్ట్ అందజేస్తున్న చారులత

కడెం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉట్నూర్ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకురాలు చారులత రాథోడ్ శనివారం కలిశారు. 1978 నుంచి 2018 వరకు 11 సార్లు జరిగిన ఖానాపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 సార్లు లంబడా సామాజిక వర్గానికి చెందిన నాయకులే గెలిచారని, ఇందులో మహిళలు మూడు సార్లు గెలిచారని, నియోజకవర్గ పొలిటికల్ రిపోర్ట్‌ను ఆయనకు అందజేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గిరిజన మహిళా కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

వైభవంగా పల్లకిసేవ



పాల్గొన్న ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో వేంకటేశ్వరస్వామివారి పల్లకి సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం అలివేలు మంగ, స్వామివారికి పంచమృతాభిషేకం, పూజలు చేశారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, పాల్గొన్నారు.

అక్టోబర్ 2న మాంసం విక్రయించొద్దు

నిర్మల్‌టౌన్: అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో చేపలు, చికెన్, మటన్ మాంసం విక్రయించొద్దని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైన మాంసం అమ్మితే మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జరిమానా సైతం విధిస్తామని హెచ్చరించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

నిర్మల్‌టౌన్: అంకితభావంతో కష్టపడి పని చేస్తేనే గుర్తింపు లభిస్తోందని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న కండక్టర్ ఎంఎస్ నాథ్, డ్రైవర్ ఎండీ ఆలీలను నిర్మల్ డిపోలో శనివారం సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, సూపరింటెండెంట్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇందిరమ్మ రాజ్యంతోనే సుపరిపాలన'

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని, ఇందిరమ్మ రాజ్యంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. సోన్ మండలం గాంధీనగర్ గ్రామస్తులు పలువురు పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. క్యాంప్ కార్యాలయంలో వారికి కండువాలు కప్పారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి జ్యోతిబాపూలే

లక్ష్మణచాంద: దేశంలో కుల వ్యవస్థకు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి జ్యోతిబాపూలే అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న పేర్కొన్నారు. మండలంలోని వడ్యాల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కుల వ్యవస్థకు అంటరానితనానికి వ్యతిరేకంగా 150 ఏళ్ల క్రితమే పోరాడిన జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దేశంలో గొప్ప సాంఘిక సంస్కర్తలు అన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి కృషి చేశారని పేర్కొన్నారు. గంగన్న, లక్ష్మి, గోదావరి, భాగ్య, ఎస్.లక్ష్మి, సరస్వతి, పద్మ పాల్గొన్నారు.

ముస్లింల హక్కుల సాధనకు కృషిచేయాలి

నిర్మల్‌టౌన్: ముస్లింల హక్కుల సాధన కోసం కృషిచేయాలని ముస్లిం డిక్లరేషన్ జిల్లా కన్వీనర్ రషీద్ అలం కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముస్లింల హక్కులు పరిరక్షించేందుకు రెండేళ్లుగా సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందులోభాగంగా జిల్లాస్థాయి సమావేశం ఈనెల15న జిల్లాకేంద్రంలోని ఐఏ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదోతరగతి, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'వర్తమాన కాలంలో ముస్లింల హక్కులు' అనే అంశంపై ఈనెల 8న వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు.

కలల మేడలో..

- మారుతున్న ప్రజల అభిరుచి..
- బహుళ అంతస్తుల భవనాల్లో నివాసానికి మొగ్గు
- పెరుగుతున్న అపార్ట్‌మెంట్ కల్చర్
- జిల్లా కేంద్రంలో నిర్మాణాల జోరు



జిల్లాకేంద్రంలోని అపార్ట్‌మెంట్

నిర్మల్‌ఖిల్లా: సొంతింటి నిర్మాణం కల ప్రతీ ఒక్కరికి ఉంటోంది. మేడలలో ఉండాలనే నిర్మాణం చేపడుతుంటారు. అందులో భాగంగా ఒకప్పుడు వ్యక్తిగత ఇళ్లు నిర్మించుకునేవారు. ఆపై ఇండిపెండెంట్ గృహాలు, ప్రస్తుతం మారుతున్న ప్రజల అభిరుచికి అనుగుణంగా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండేందుకు ఆసక్తిచూపుతున్నారు. రోజురోజుకూ అపార్ట్‌మెంట్ కల్చర్ పెరుగుతోంది. జిల్లాకేంద్రంలో మధ్య తరగతి కుటుంబాల నుంచి ఉన్నత వర్గాల వారు బహుళ అంతస్తుల భవనాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో సాక్షి సండే స్పెషల్ కథనం.

50కి చేరువలో నిర్మాణాలు..

జిల్లా కేంద్రం ఏర్పాటుకు ముందు పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉండగా ఇప్పుడు ఏకంగా 50కి చేరువలో నిర్మాణాలు ఉన్నాయి. ఒక్కో అపార్ట్‌మెంట్ దాదాపు 40 నుంచి 50 వరకు కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. లిఫ్ట్ సౌకర్యం, వాచ్‌మెన్, పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. ఉద్యోగాలకు వెళ్లి రాత్రి వరకు వచ్చే ప్రజలు ఎక్కువగా అపార్ట్‌మెంట్లలో నివసించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

ధర..ఎక్కువే

అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ కొనుగోలు చేయాలంటే ధర ఎక్కువగానే ఉన్నాయి. రెండు పడక గదులు, మూడు పడక గదులు వసతుల సౌకర్యాన్ని బట్టి రూ.40 లక్షల నుంచి 60 లక్షల వరకు ధర ఉన్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్లాట్ల కొనుగోలులో రుణ సౌకర్యం కల్పిస్తుండడంతో వీటికి డిమాండ్ ఉంది.

ఐక్యంగా ఒకే చోట..

దాదాపు 40 నుంచి 50 కుటుంబాల వారు అంతా ఒకేచోట గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏ కాలనీ చూసినా అపార్ట్‌మెంట్లు దర్శనమిస్తున్నాయి. ప్రియదర్శినినగర్, దివ్యనగర్, శాస్త్రినగర్, శ్రీనగర్‌కాలనీ, ఆదర్శనగర్, ఇంద్రనగర్, తదితర ప్రాంతాల్లో అధికంగా నిర్మాణాలు ఉన్నాయి. నిర్మాణ సమయంలో అడ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకుంటున్నారు. ఇందులో నివసించే కుటుంబాల వారు వివిధ పండుగలు, వేడుకలకు ఐక్యంగా నిర్వహించుకుంటున్నారు.

కలిసిమెలిసి ఉంటాం



గత కొన్నేళ్లుగా అపార్ట్‌మెంట్‌లో ప్లాటు కొనుగోలు చేసి నివసిస్తున్నాం. అపార్ట్‌మెంట్లో 40 కుటుంబాల వారు పండుగలు, వేడుకలను కలిసి మెలిసి నిర్వహించుకుంటాం. వినాయక చవితి, దీపావళి, దసరా పండుగలు నిర్వహించుకుంటాం.

– జి.రామకృష్ణ,ప్రభుత్వ ఉపాధ్యాయుడు,శ్రీ అపార్ట్‌మెంట్, నిర్మల్

ప్రజల అభిరుచితోనే..



ప్రజల అభిరుచితోనే అపార్ట్‌మెంట్లలో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాణ సమయంలో బుక్ అవుతున్నాయి. వీటిల్లో భద్రత ఎక్కువగా ఉంటుంది. సీసీ కెమెరాలు నిఘా, రక్షణ చర్యలు, వాచ్‌మెన్ వసతి, పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యం ఉండడంతో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరుగుతోంది.

– ఎం.సతీశ్‌రెడ్డి, అపార్ట్‌మెంట్ బిల్డర్

సాదాసీదాగా మండల సమావేశం

- అధికారుల పనితీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో కొన్ని శాఖలపైనే చర్చలు నిర్వహించి సమావేశాన్ని గంటన్నరలోపే ముగించేశారు. అంతకుముందు ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సమావేశం ప్రారంభంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ, పీఆర్ఏఈ జగదీశ్ పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవో గణేశ్ మాట్లాడుతూ అధిక వర్షాలకు సోయా పంటలకు తెగులు సోకిందని, దీనికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బెంబర సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ భారీ వర్షాలతో చెరువుకట్ట కింద, వాగు ఇరువైపులా పంటనష్టం జరిగినా ఇప్పటికి బాధిత రైతులకు పరిహారం అందలేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పృథ్వీ నివేదికలు చదువుతుండగా అతని పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంబర, జౌలా(బి)తోపాటు పలు గ్రామాల్లో ఇప్పటికి భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని సర్పంచులు బాలాజీ, సత్తప్పా పటేల్ మండిపడ్డారు. 10 గ్రామాల మినహా ఎక్కడా కూడా భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా కావడం లేదన్నారు. కోలూరులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని సర్పంచ్ కాంతుల చంద్రకళ ఏఈ జాదవ్ ప్రదీప్ దృష్టికి తీసుకెళ్లారు. నెల రోజుల్లో అవసరం ఉన్న చోట స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. పీఆర్ఏఈ జగదీశ్ మాట్లాడుతుండగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు అందలేదని, కార్యాలయాల చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను అందేలా చూస్తామ పీఆర్‌డీఈ చందు పేర్కొన్నారు. ఏపీవో గంగాధర్ మాట్లాడుతూ గ్రామాల్లో హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తయినట్లు తెలిపారు. మొగ్లిలో 50 మంది కూలీలకు వారానికి సంబంధించిన కూలీ డబ్బులు అందలేదని ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్ సభా దృష్టికి తీసుకువచ్చారు. టెక్నికల్ సమస్య కారణంగా రాలేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, తహసీల్దార్ లింగమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

నర్సాపూర్(జి): జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 పోటీల్లో నర్సాపూర్(జి) ఆశ్రమ ప్రాథమికోన్నత పాఠశాల గిరిజన విద్యార్థులు ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆర్చరీలో సీహెచ్.సతీశ్, సీహెచ్.రంజిత్ సింగ్, కబడ్డీలో ఆర్.నానేశ్వర్, ఆర్.గోకుల్, వాలీబాల్‌లో జె.గణేశ్, ఆర్.శుభం, సీహెచ్.జగదీశ్, జె.కరణ్, ఆర్.పవన్ ప్రతిభ చాటారు. ఈనెల 3,4 తేదీల్లో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని డీటీడీఓ అంబాజీ వివరించారు. విద్యార్థులను హెచ్ఎం రమేశ్, వసతి గృహ సంక్షేమాధికారి కిష్టారెడ్డి, టీచర్లు అభినందించారు.

కేసీఆర్, ఐకేరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న జేఏసీ నాయకులు

మామడ: పొన్కల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో గ్రామంలో శనివారం జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్రమంత్రి ఐకేరెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు గంగారెడ్డి, భూమేశ్వర్, సుధాకర్‌రెడ్డి, గంగన్న, నరేశ్‌రెడ్డి, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా. మండల సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఐకేరెడ్డిని కలిశారు. పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం'

- రాష్ట్ర నాయకుడు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్



మాట్లడుతూన్న రావుల రాంనాథ్

దస్తురాబాద్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 3న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి సాగర్‌గౌడ్, నాయకులు రామగౌడ్, కిషన్, శివ, రఘు, లక్ష్మీనర్సయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టండి



మురుగుకాల్వలు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కిషోర్‌కుమార్

ముధోల్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిప్యూటీ కలెక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. ముధోల్‌లోని చించాల పంచాయతీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని మురుగుకాల్వలు, సెగ్రిగేషన్‌షెడ్డు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు సరిగ్గా లేదని, గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీటీ శేఖర్, ఎంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి అమిత ఉన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

లోకేశ్వరం: పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండలంలోని జోహర్‌పూర్ గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్, మురుగు కాలువలు, రోడ్లతోపాటు పంచాయతీ రికార్డులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంలో అర్హుల జాబితాను తయారు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సృజల, కారోబారి నర్సయ్య, నాయకుడు దిగంబర్ ఉన్నారు.

ఆశవర్కర్ల సమస్యల పరిష్కారంలో విఫలం



మానవహారంగా ఏర్పడ్డ ఆశవర్కర్లు

ఖానాపూర్: ఆశవర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి అన్నారు. పట్టణంలో ఖానాపూర్, పెంబి మండలాల ఆశవర్కర్లతో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగన్నాథ్‌రావు చౌరస్తా వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా గంగామణి మాట్లాడుతూ కనీస వేతనం రూ.18వేలకు పెంచడంతోపాటు రావల్సిన అలవెన్సులు, బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ఆశవర్కర్లకు పనిభారం తగ్గించి జాబ్‌చార్ట్‌ను ప్రకటించాలన్నారు. ప్రసూతి సెలవుల సర్క్యులర్ జారీ చేసి 32 రకాల రిజిస్టర్‌లను ప్రభుత్వం ప్రింట్ చేసి సరఫరా చేయాలన్నారు. ప్రమాదబీమా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ముందు ఐదోరోజు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కమల, స్వాతి, మమత, పద్మ, సంధ్య తదితరులు ఉన్నారు.

ముధోల్: ముధోల్‌లోని జ్యోతిబాపురావు పూలే చౌరస్తా వద్ద శనివారం ఆశవర్కర్లు మానవహారం నిర్వహించి నిరసనలు తెలిపారు. గ్రామాల ఆశవర్కర్లు ఉన్నారు.

'కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'

కుంటాల/లోకేశ్వరం: ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కుంటాలలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలిపారు. లోకేశ్వరంలో ఆశవర్కర్ల సమ్మెకు మద్దతు ప్రకటించారు. నాయకులు తులసీరాం, మీనాజ్, లతీఫ్, అలీంఖాన్, సలీం, ఇంద్రమాల, మమత, దేవకి, లక్ష్మి, సంతోష, ఉమా, ప్రతిభ, రాధ, శ్రీలత, నందకుమారి, కమల, లక్ష్మి, శ్రీలత, రాణి విజయ, గోదావరి, సుజాత పాల్గొన్నారు.

ఆశకార్యకర్త వేతనం నిలిపివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తానూరు: మండలంలోని ఝరి(బి)తండా గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త విమల్‌బాయికి సంబంధించిన 2022 అక్టోబర్ వేతనం నిలిపివేసిన ఏఎన్ఎం వెంకటరమణ, వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆశకార్యకర్తలు శనివారం ధర్నా చేశారు. వారికి బెల్‌తరోడా సర్పంచ్ గోపా సాయినాథ్ మద్దతు ప్రకటించారు. విషయం తెలుసుకున్న సూపర్‌వైజర్ అబ్దుల్ ఖాషీం అక్కడికి చేరుకుని నెల వేతనం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

సంక్షిప్తంగా

ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసిన సర్పంచులు

లోకేశ్వరం: మండలంలోని నగర్ సర్పంచ్ నరేందర్ రెడ్డి, పుస్పూర్ సర్పంచ్ సంగెం నర్సన్న, భైంసా మండలం ఖత్‌గాం సర్పంచ్ రాజులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

3న మోకు దెబ్బ రాష్ట్ర మహాసభలు

నిర్మల్‌టౌన్: గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర మూడో మహాసభలను ఈనెల 3న నిర్మల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. మహాసభ పోస్టర్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల నాయకులు నారాయణ, వర్మ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఐదోరోజు చేపట్టిన నిరవధిక సమ్మెను ఉద్దేశించి మాట్లాడారు. జీవో 8 ప్రకారం పెంచిన వేతనాలతోపాటు ఏరియర్స్ చెల్లించాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు.

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు

ముధోల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు శనివారం బీఎస్పీ ముధోల్ నియోజకవర్గ అధ్యక్షుడు నల్ల రవికుమార్ మద్దతు తెలిపారు. దేవిదాస్, సునీల్, రాజు, రేష్మ, వనిత, శ్రీదేవి, రేఖ, శోభ ఉన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నమస్కరిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.

లంబడాల జోలికి వస్తే ఊరుకోం

కడెం: లంబడాల జోలికి వస్తే ఊరుకోమని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు భుక్యా కిషన్‌నాయక్, రాష్ట నాయకుడు హవవత్ రాజేందర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం వారు మాట్లాడారు. ఇటీవల ఎంపీ సోయం బాపూరావు, కాంగ్రెస్ నాయకుడు వెడ్మ బొజ్జు చేసిన వ్యాఖ్యలకు క్షమాపణాలు చెప్పాలన్నారు. కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మున్యాల్ తండా సర్పంచ్ సురేశ్‌నాయక్, నాయకులు రాజేశ్‌నాయక్, రమేశ్, తదితరులు ఉన్నారు.

సన్మానం

కుభీర్: పల్సి పాఠశాలలో పనిచేస్తున్న దొంతుల సురేష్‌కు పీజీ హెచ్ఎంగా ఇటీవల పదోన్నతి వచ్చింది. అదేవిధంగా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన రాఘవేంద్ర, సంజు, సంగి రాజేశ్వర్ రాగా శనివరం సన్మానించారు.

మోదీ సభకు తరలిరావాలి

కడెం: మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించే ప్రధాని మోదీ బహిరంగ సభకు బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కిష్టయ్య, సదాశివ్, రాజేందర్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో మనీషా అన్నారు. సుర్జాపూర్ పంచాయతీలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగీ సంబంధిత పరీక్షలు చేశారు. ఏఎన్ఎంలు యోద్బేనా, రజిత, హెల్త్ అసిస్టెంట్ రమణ తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీకి దరఖాస్తులు ఆహ్వానం

కడెం: దసరా సెలవుల్లో నిర్వహించనున్న బాబుభాయ్ ట్రోఫీ కడెం ప్రీమియర్ లీగ్-1 క్రికెట్ పోటీలకు కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆసక్తి ఉన్న క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ప్రతి క్రీడాకారుడు రూ.50ల ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9492365497 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

లక్ష్మణచాంద: వడ్యాల్‌కు చెందిన జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనితో చదివిన వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తలకొంత డబ్బులు పోగుచేశారు. బాధిత కుటుంబ సభ్యులకు శనివారం రూ.25 వేల నగదు అందించారు. మహేశ్, రమణగౌడ్, నర్సయ్య, ప్రశాంత్, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

ఖానాపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం నిర్వహించే పీవైఎల్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు పెందూరు మోహన్ కోరారు. పట్టణంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ ప్రదీప్ హాజరవుతారని, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గడప గడపకూ బీజేపీ

భైంసారూరల్: గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం పాంగ్రి, చుచుంద్ గ్రామాల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్ కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో బీజేపీ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

కుంటాల: ప్రతీ ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు.స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఏపీఎం అశోక్,సీఈఓ నాగభూషణం, కార్యదర్శి రాజబాపు,ఎఫ్ఏ రాజేశ్వర్, సీసీ యూసుఫ్, అకౌంటెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

మత సామరస్యం చాటిన ముస్లిం సోదరుడు

కుంటాల: ఓలా గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ముస్లిం సోదరుడు ఎండీ యూనుస్ యువకులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేసి మతసామరస్యం చాటుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు. వీడీసీ చైర్మన్ మహేందర్, మాజీ కోఆప్షన్ మెంబర్ హైమద్ పాషా ఉన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కడెం: పోడు పట్టాలివ్వాలని మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ జీపీ పరిధిలోని గొండుగూడవాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆదివాసీలు పోడు కాగితాలతో నిరసన తెలిపారు. మాడావి అమృతరావు, వెడ్మనాగోరావు, భీంరావు, ఇస్రూ, సురేందర్, లక్ష్మీ, గంగుబాయి, శైలజ, తదితరులు ఉన్నారు.

బీడీ కంపెనీ టేకేదార్ల జాబితా పరిశీలన

లోకేశ్వరం: అర్హులైన బీడీ కంపెనీ టేకేదార్లకు పింఛన్లు అందజేస్తామని ఐకేపీ డీపీఎం శోభారాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో టేకేదార్ల జాబితాలను శనివారం పరిశీలించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఉన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

నిర్మల్‌టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలనీలో శనివారం స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ ఈఈ అజార్, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

గుంతలు పూడ్చివేత

ముధోల్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. దీంతో స్థానికులు ట్రాక్టర్ సహాయంతో సొంత ఖర్చులతో శనివారం గుంతలు పూడ్చివేశారు.

షీటీమ్ సేవలపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో షీటీమ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై సుమాంజలి మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఆపద సమయంలో 100 డయల్‌కు, షీ టీమ్ 8712659550 సెల్‌నంబర్‌ను సంప్రదించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ లింగయ్య, ఉమెన్ పీసీ రమా దేవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

బచ్పన్ స్కూల్‌లో ఫ్లవర్స్ డే

నిర్మల్‌రూరల్/నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బచ్పన్ పాఠశాలలో శనివారం ఫ్లవర్స్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు రకరకాల పూలు తీసుకొచ్చి ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ అయ్యన్నగారి శ్రీధర్, ప్రిన్సిపాల్ అయ్యన్నగారి రచన, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నానమ్మ, తాతయ్యలకు వివిధ పోటీలు నిర్వహించారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పాఠశాల నిర్వాహకులు లింగారెడ్డి, జగదీశ్‌రెడ్డి, పోతారెడ్డి, జైసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామడలో మేరి మాటి–మేరి దేశ్

మామడ: మండల కేంద్రంలో శనివారం మేరి మాటి–మేరి దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య వజ్రోత్సాలు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వాతంత్ర్య కోసం వీరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. సర్పంచ్ హన్మాగౌడ్, పోస్టాఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు కఠినంగా శిక్షించాలి

నిర్మల్‌చైన్‌గేట్: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో భగత్‌సింగ్ భవన్‌లో సంఘం నాయకులు నిరసన తెలిపారు. రమాదేవి, గోదావరి, భాగ్య, సౌందర్య, కవిత పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఖానాపూర్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో రిలయన్స్ ఫౌండేషన్‌తోపాటు డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం టైలరింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీడీవో మల్లేశ్, డీపీఎం సాయిప్రసాద్, ఏపీఎం భోజన్న ఉన్నారు.

3 నుంచి యోగా–ధ్యానంపై శిక్షణ

భైంసాటౌన్: భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలన శాస్త్రం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'యోగా–ధ్యానం'అనే అంశంపై 30 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం సుధాకర్ తెలిపారు. ఈనెల 3 నుంచి ప్రతీరోజు మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 శిక్షణ తరగతులు ఉంటాయన్నారు

ఘనంగా గణేశ్ నిమజ్జనం

కుంటాల: మండల కేంద్రంలో గణేశ్ నిమజ్జనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సీఐ నైలు, ఎస్సై హన్మాండ్లు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి బ్యాండ్ మేళాలు, మహిళల కోలాటాలు, నృత్యాలతో శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. సర్పంచులు సమత, పద్మబాయి పాల్గొన్నారు.

పాముకాటుకు ఎద్దు మృతి

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన పీలీ గంగన్నకు చెందిన ఎద్దు శనివారం పాముకాటుతో మృతి చెందింది. పశువైద్యశాలలో ఇంజక్షన్ లేక, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఎద్దు చనిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎద్దు విలువ సుమారు రూ.40 వేలు వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరాడు.